క్లుప్తంగా

పెద్దిరెడ్డిని కలిసిన మండల నేతలు



పెద్దిరెడ్డితో రాజేష్, మండల నేతలు

నాగలాపురం: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఇటీవల చేతికి గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇది తెలుసుకున్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో కలిసి నాగలాపురం మండల నేతలు తిరుపతిలోని ఆయన స్వగృహానికి చేరుకుని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీరేంద్ర వర్మ, భానుప్రకాష్ రెడ్డి, అపరంజిరాజు, చిన్నదొరై సుధా, మొదలియార్, ధనరాజ్ పాల్గొన్నారు.

సరస్వతీ శిశుమందిర్‌లో నవమి వేడుకలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో శనివారం శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప హాజరయ్యారు. నవమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

రామాలయాలు ముస్తాబు



ముస్తాబైన పట్టాభి రామాలయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని పలు రామ మందిరాలు శ్రీరామ నవమికి ముస్తాబయ్యాయి. అందులో భాగంగా మందిరాలకు వెల్ల వేసి సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న పట్టాభి రామాలయంలో ఏర్పాట్లను ఈఓ బాపిరెడ్డి శనివారం పర్యవేక్షించారు. ఆదివారం పూజలు, సీతారాముల కల్యాణం జరగనుంది.

హోంమంత్రికి సాదర స్వాగతం



రేణిగుంట రైల్వే స్టేషన్‌లో హోం మంత్రి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): తిరుమల పర్యటన నిమిత్తం విజయవాడ నుంచి రేణిగుంట రైల్వే స్టేషన్‌కు వందే భారత్ రైలులో శనివారం రాత్రి చేరుకున్న రాష్ట్ర హోం మంత్రి అనితకు అధికారులు, టీడీపీ నాయకులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన మంత్రి తిరుమలకు బయలు దేరి వెళ్లారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నాగలాపురం: మండలంలోని కాలంజేరి, నాగలాపురం, కొట్టకాడు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను శనివారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. మొదట కాలంజేరి దళితవాడలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాగలాపురం కోట వీధిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమాన్ నాయక్, ఎంపీడీఓ బాలాజీ నాయక్, ఈఓపీఆర్డీ నాగరత్నమ్మ, ఈఓ రమేష్, మండల అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, నాయకులు పాల్గొన్నారు.



అరుదూరు అంగన్‌వాడీలోనే ప్రాథమిక పాఠశాలను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పక్క చిత్రంలో కనిపిస్తున్న తరగతి గది అరుదూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం. ఇందులోని ఒకే గదిలో అటు అంగన్‌వాడీ , ఇటు ప్రాథమిక పాఠశాల తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఒకటి నుంచి అయిదు తరగతులకు సంబంధించి 18 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడి పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పాఠశాల అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వంలో రెండో విడత నాడు–నేడులో ఎంపిక చేశారు. మొదటి విడతగా ఎన్నికల ముందు రూ. 8 లక్షల నిధులను పాఠశాల ఖాతాకు జమ చేసింది. తద్వారా పాఠశాల భవనం మరుగుదొడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు విడుదల కాకపోవడంతో పనులు ఆగిపోయాయి. దీంతో పాఠశాల విద్యార్థులకు చదువుకునేందుకు తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు.



కదూరు పంచాయతీ కార్యాలయంలో తరగతులు నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు

పక్క చిత్రంలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న గది కదూరు పంచాయతీ కార్యాలయ భవనం. ఇక్కడ ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వంలో నాడు–నేడు ద్వారా ఈ పాఠశాల ఎంపికైంది. నూతన పాఠశాల భవనం, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 20 లక్షలకు పైగా నిధులు మంజూరయ్యాయి. మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాఠశాల భవన నిర్మాణ పనులు పునాది స్థాయిలో ఆగిపోయాయి. దీంతో గత విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి కదూరులోని పంచాయతీ కార్యాలయ శిథిల భవనంలో పాఠశాలను నిర్వహిస్తున్నారు. చిన్నపాటి ఈ గదిలో అందరూ ఓ చోట కూర్చోవాల్సిన పరిస్థితి. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల నడుమ అక్కడ ప్రాథమిక పాఠశాల నిర్వహణ ఉపాధ్యాయులకు భారంగా మారుతోంది.

నోటీస్ బోర్డు

నేటి నుంచి పెద్దకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం నుంచి 12వ తేదీ వరకు పెద్దకొట్టాయి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి పేర్కొన్నారు. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సాయంత్రం 7గంటలకు ప్రధాన ఆలయ అలంకార మండపం నుంచి కోట మండపం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి అనంతరం ఆలయంలోకి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. 12వ తేదీ రాత్రి స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు.



రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

పొంచి ఉన్న ప్రమాదం

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని సుద్దమిట్ట గిరిజన కాలనీ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ తో ప్రమాదం పొంచి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదకరంగా ఉంది. మరోవైపు వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ విషయంపై అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గిరిజనులు, రైతులు వాపోతున్నారు. –బుచ్చినాయుడుకండ్రిగ



ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

వానాకాలం చదువులు

- అర్ధంతరంగా ఆగిపోయిన 'నాడు–నేడు' పనులు
- అరుదూరు అంగన్‌వాడీలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాల
- పంచాయతీ గదిలో కదూరు ప్రాథమిక పాఠశాల తరగతులు
- అవస్థలు పడుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



కదూరులో నిరుపయోగంగా బల్లలు, కుర్చీలు



కదూరులో గడ్డకట్టిన సిమెంటు బస్తాలు



పునాది దశలో ఆగిపోయిన కదూరు పాఠశాల భవనం



అరుదూరులో నిర్మాణ దశలో ఆగిపోయిన పాఠశాల భవనం

వరదయ్యపాళెం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పేద పిల్లలు చదివే సర్కారు బడులను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారు. అయితే కొన్ని పాఠశాలలకు రెండో విడత కింద నాడు–నేడు పనులు మంజూరయ్యాయి. ఆ నిర్మాణ పనులు జరిగే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. దీంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాడు–నేడుకు నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుకునేందుకు తరగతి గదులు లేక అవస్థలు పడుతున్నారు. వరదయ్యపాళెం మండలంలో కదూరు, అరుదూరు గ్రామాల్లో గతంలో ఉన్న శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాలను నేలమట్టం చేసి ఆ ప్రాంతంలో నూతన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఆ రెండు చోట్ల నాడు–నేడు పనులు జరగడం లేదు. దీంతో అక్కడ రోజువారీ తరగతుల నిర్వహణ ఉపాధ్యాయులకు ఎక్కడ నిర్వహించాలో పెద్ద సమస్యగా మారింది.

ప్రైవేటుకు పంపించే ఎత్తుగడ

పాఠశాల గదులు లేక తరగతి గదుల నిర్వహణ ప్రశ్నార్థకంగా ఉన్న పరిస్థితులు కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదు. కనీసం ఇలాంటి అత్యవసర పరిస్థితుల గురించి మానవతా దృక్పథంతో ఆలోచన చేయాల్సింది పోయి అసలు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ఏడాది పాటు ఇదే పరిస్థితులను కొనసాగిస్తే వారంతట వారే పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించే పరిస్థితులను ప్రభుత్వం కల్పిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

నిరుపయోగంగా ఫర్నీచర్

కదూరు, అరుదూరు ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల కోసం బెంచీలు, బల్లలను గత ప్రభుత్వం పంపిణీ చేసింది. అయితే తరగతి గదులే లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఎంతో విలువైన సామగ్రి ఇలా వృథా అవుతుండడం గమనార్హం. అంతేకాక విద్యార్థులకు శుద్ధజలం అందించేందుకు పంపిణీ చేసిన శుద్ధజలం పరికరాలు సైతం వృథాగా మారాయి. కదూరులో భవన నిర్మాణం కోసం ప్రభుత్వం అందజేసిన సిమెంటు బస్తాలు గడ్డకట్టి పోయి వినియోగించడానికి వీలు లేకుండా మారింది. ఇలా ప్రభుత్వ ధనం కూటమి నిర్లక్ష్యాలకు దుర్వినియోగం అవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలల తరగతి గదుల సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంగుణోత్తర ఉత్సవాలు ప్రారంభం



ఊయల సేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏడు రోజుల పాటు నిర్వహించే పంగుణోత్తర ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో ప్రతి రోజు అమ్మవారికి అభిషేకం, సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు తెలిపారు. శనివారం సుప్రభాత సేవతో నిత్యపూజా కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. సాయంత్రం పద్మావతీ అమ్మవారికి పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలను అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఊయల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఇంట్లోనే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ

అంగన్‌వాడీ అగచాట్లు

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని ఆర్.అనంతాపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 23 మంది పిల్లలు, 18 మంది గర్భిణులు ఉన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త పదేళ్లుగా సొంత ఇంట్లోనే కేంద్రాన్ని నడుపుతున్నారు. పౌష్టికాహారాన్ని భద్రపరుచుకునేందుకు స్థలం లేక అవస్థలు పడుతున్నారు. –బుచ్చినాయుడుకండ్రిగ

ఘనంగా భూమన జన్మదిన వేడుకలు



కేకు కట్ చేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

నాగలాపురం: వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఎంపీపీ సింధు శ్యామ్ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉదయ్ కుమార్ రెడ్డి, మోహన్ మొదలియార్, దానివేలు, దేశప్పన్ పాల్గొన్నారు.

తప్పులతడక



బుచ్చినాయుడుకండ్రిగ మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలోని సమాచార హక్కుచట్టం బోర్డులోని పేర్లు తప్పులుగా ఉన్నాయి. బోర్డులోని పౌర సమాచార అధికారి పేరు లేకపోవడం, లేని అధికారుల పేర్లు ఉండడంతో మండల ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. అక్కడ స.హ.చట్టం ఎలా అమలవుతుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. –బుచ్చినాయుడుకండ్రిగ

నిరాశలో తమ్ముళ్లు

- సత్యవేడుకు దక్కని నామినేటెడ్ పోస్టులు
- భర్తీకాని నాగలాపురం, బీఎన్‌కండ్రిగ మార్కెట్ కమిటీ పదవులు



మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి భర్తీకానీ బీఎన్‌కండ్రిగ మార్కెట్ కమిటీ కార్యాలయం

వరదయ్యపాళెం: రాష్ట్ర వ్యాప్తంగా 38 నియోజకవర్గాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామకం మూడో విడత శుక్రవారం ప్రకటించారు. అయితే సత్యవేడు నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటి వరకు నామినేటెడ్ పదవులు భర్తీకాక పోగా రాష్ట్రస్థాయి పదవుల్లో సైతం చోటు లభించలేదు. దీంతో తెలుగు తమ్ముళ్లు తీవ్ర నిరాశ చెందుతున్నారు. సత్యవేడు పరిధిలో నాగలాపురం, బీఎన్‌కండ్రిగ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ రెండు కమిటీలకు సంబంధించి చైర్మన్లుగా అవకాశం కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అధిష్టానం మాత్రం అవేమీ పట్టించుకోకుండా పక్కన పెట్టడంతో పార్టీ శ్రేణులు ఆగ్రహంతో రగిలి పోతున్నారు. ఇప్పటి వరకు మూడు దశల్లో రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పదవుల భర్తీ జరిగినప్పటికీ సత్యవేడు నియోజకవర్గానికి మాత్రం ప్రాధాన్యం దక్కలేదు. దీంతో కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ శ్రేణులు తీవ్ర నిరాశలో కూరుకుపోయాయి.

సత్యవేడు టీడీపీకి ఇన్‌చార్జ్‌ని ప్రకటించే దమ్ముందా..

- ఎమ్మెల్యే అనుకూల వర్గీయుల ఆగ్రహం



సమావేశంలో ఎమ్మెల్యే అనుకూల వర్గీయులు

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గ టీడీపీకి ఇన్‌చార్జ్‌ని ప్రకటించే దమ్ము..ధైర్యం నియోజకవర్గ పార్టీ శ్రేణులకు లేదని ఎమ్మెల్యే అనుకూల వర్గీయులు ఆరోపించారు. శనివారం కేవీబీపురం మండలంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు రోజుల క్రితం సత్యవేడుకు ఇన్‌ఛార్జ్‌ని నియమించాలని ఎమ్మెల్యే ఆదిమూలంకు వ్యతిరేకంగా పార్టీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేసిన నాయకుల తీరును వారు తీవ్రంగా ఖండించారు. ఫిర్యాదు చేసిన నాయకులు గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసిన వారేనని పేర్కొన్నారు. అనవసర ఆరోపణలతో ఇలాంటి కుట్రలు చేయడం మానుకోవాలని, ఇదే తీరును కొనసాగిస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయపేడు సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీపీ మణి, కేశవులు నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బడుగు వర్గాల ఆశాజ్యోతి



శ్రీకాళహస్తి : జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న స్కౌట్ విద్యార్థులు



వరదయ్యపాళెం : జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న తహసీల్దార్



రేణిగుంట : జగ్జీవన్ రామ్‌కు నివాళి అర్పిస్తున్న ఆర్డీవో , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాయక్





శ్రీకాళహస్తి : నివాళులర్పిస్తున్న డీటీ ప్రేమ్‌కుమార్, బుచ్చినాయుడుకండ్రిగలో నేతల నివాళి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ఘనంగా జరిపారు. రేణిగుంట తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాయక్, తహసీల్దార్ సురేష్ బాబు, ఆర్ఐ జయకృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నగేషం, ఈఓ మణి చిత్రపటానికి నివాళులర్పించారు. మండలంలోని ఎల్ ఎస్ కండ్రిగలోని ప్రభుత్వ పాఠశాలలో ఆకాంక్ష సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిబాబు ఆధ్వర్యంలో జగ్జీవన్ జయంతిని నిర్వహించారు.

వరదయ్యపాళెం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా అనేక కార్యక్రమాలు చేపట్టిన ఘనత మాజీ భారత ఉప ప్రధాని, సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ అని తహసీల్దార్ రాజశేఖర్ కొనియాడారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో వీఆర్వోలు మధుస్వామి, రవిరెడ్డి, మోహన్, రమణయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో బాబూ అగ్రహారం మున్సిపల్ హైస్కూల్ నందు జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ చైర్మన్ అజారుద్దీన్, స్కౌట్స్ విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా తహసీల్దారు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ ప్రేమ్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో శనివారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మల రాఘవయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్నరావు, పండయ్య, కిరణ్‌కుమార్, రమేష్‌కుమార్, సుదర్శన్, రాఘవేంద్ర, నాగరాజు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని పలు పుష్పాలతో అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.